ఖేడ్‌లో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



నారాయణఖేడ్ పట్టణంలో జాతీయగీతాన్ని ఆలపిస్తున్న బీజేవైఎం నాయకులు

నారాయణఖేడ్: పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా యాత్రను నిర్వహించి రాజీవ్‌చౌక్‌లో జాతీయ గీతాన్ని ఆలపించారు. పౌరుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు తిరంగాయాత్రను నిర్వహించినట్లు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం తెలిపారు. దశరథ్, భూమ్‌రాజ్, రాథోడ్ సంతోష్, రాజుగౌడ్, సాయేందర్, సాయిసాగర్, సచిన్, శివ, లోకేష్ ఉన్నారు.

జోగిపేటలో..



జోగిపేటలో తిరంగా జెండా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

జోగిపేట(అందోల్): పట్టణంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా జెండా ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు కూడా తిరంగా జెండా ర్యాలీని నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభాకర్‌గౌడ్, ప్రభాత్, జగన్నాథం, గాజుల నవీన్, సతీష్, గోపాల్ రావు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

సంగారెడ్డి రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డి పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఐటీఐ నుంచి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర అధ్యక్షులు విట్టల్ నగర కార్యదర్శి మహేష్, శశాంక్, నిఖిల్, వెంకట్, తానాజీ, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



సంగారెడ్డిటౌన్: ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో హిందూ ఐక్యవేదిక నాయకులు ర్యాలీ

నారాయణఖేడ్/కంగ్టి(నారాయణఖేడ్): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మండల కేంద్రమైన నిజాంపేటలో బుధవారం బంద్ నిర్వహించారు. దుకాణాలు, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. పార్టీలకతీతంగా నాయకులు, గ్రామపెద్దలు, యువకులు ప్రదర్శన నిర్వహించి ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. హిందువులపై జరుగుతున్న దాడులను నివారించాలని కోరారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, రాధాకిషన్, బీఆర్ఎస్ నాయకులు సప్తగిరి తదితరులు పాల్గొన్నారు. అలాగే కంగ్టి మండలం తడ్కల్‌లో బుధవారం బంద్ పాటించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కాపర్తి అంజనేయులు, రమేష్‌గౌడ్, మామిడి పండరి, రెడ్డి కృష్ణ, అంజయ్యచారీ, దత్తురావు, జ్ఞానేశ్వర్‌గౌడ్, మాడ రమేష్, గోగేకర్‌రాజు, యువకులు పాల్గొన్నారు.

ఇస్మాయిల్‌ఖాన్ పేటలో..

సంగారెడ్డిటౌన్: బంగ్లాదేశ్లో హిందువులపై దాడులకు నిరసనగా బుధవారం సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్ ఖాన్ పేటలో హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.

పటాన్‌చెరులో బంద్ ప్రశాంతం

పటాన్‌చెరు టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసకాండకు నిరసనగా పటాన్‌చెరు 113డివిజన్ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛంద బంద్ నిర్వహించారు. బుధవారం రామ్ మందిర్ దేవస్థానం నుండి వివిధ పార్టీల నాయకులు, వర్తక సంఘం సభ్యులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.



నారాయణఖేడ్: నిజాంపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు



ర్యాలీగా వెళ్తున్న నాయకులు, వర్తక సంఘం సభ్యులు

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రం హత్నూర బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్వర్గీయ బాదే పద్మబాయ్ బాలకృష్ణరావు గార్ల జ్ఞాపకార్థం మైక్‌సెట్‌ను బుధవారం పొలిటికల్ స్ట్రెటజిస్ట్ సోషల్ ఆక్టివేట్ అజయ్ మారుతి రావు బహూకరించారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత ఊరు పాఠశాలకు సొంత డబ్బులతో మైక్‌సెట్‌ను అందిస్తానని అజయ్ మారుతిరావు తెలిపారు.

ఉపాధ్యాయుల నిరసన

మునిపల్లి(అందోల్): బదిలీలు వెంటనే చేపట్టాలని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. బుధవారం మునిపల్లి మోడల్ స్కూల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బదిలీలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులు సునీల్, రవి, నరేశ్, మంతోత్, నర్సింగ్‌రావు, ఉషా, ఆశాలత, రమాదేవి, వాజిద తపస్సుం, మహేశ్, విజయతో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దత్తగిరిలో ఈటల పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆశ్రమానికి వచ్చిన ఆయనకు ఆశ్రమ మర్యాదలు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమంలోని జ్యోతిర్లింగాల వద్ద స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఆశ్రమ ఆవరణలోని పంచ మహావృక్షాల వద్ద పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వామి తీర్థ ప్రసాదాలు అందించి, పూలమాల శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందించారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని పెద్దశంకరంపేట, కంగ్టి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తన స్వగృహంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో మనూరు పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, సచిన్, కుమార్, అఖిలేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఖేడ్ పట్టణంలోని షాదీఖానను ఎమ్మెల్యే ముస్లిం నాయకులతో కలిసి పరిశీలించారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

నారాయణఖేడ్: విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టనున్నామని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ తహసీల్ మైదానంలో ఆయా కార్యక్రమాల కోసం చేస్తున్న ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఆర్డీఓ అశోక చక్రవర్తి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, వివిధశాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

డివిజన్‌లో.. బస్తీ దర్శన్



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని ఎస్సీ బస్తీలో బుధవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్, అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బస్తీవాసులు పలు సమస్యలను అధికారుల దృష్టి తీసుకొనివచ్చారు. ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కారించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు.

పనుల పరిశీలన

పటాన్‌చెరు: బంధం కొమ్ము నుంచి అమీన్‌పూర్ రోడ్డు విస్తరణ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ లైన్ స్తంభాలు మారుస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. బుధవారం రోడ్డు విస్తరణ జరుగుతున్న పనులను పటాన్‌చెరు రూరల్ ఏఈతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేత



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేస్తున్న కొమ్మూరి ఫౌండేషన్ ప్రతినిధులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నాగులపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్సులు,టై, బెల్ట్, స్టికర్ అండ్ మౌత్ పీస్‌లను దాతలు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.కొమ్మూరి ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ లను అందించిన శ్రీనివాస్, సంతోషమ్మలను, టై,బెల్ట్స్ అందించిన గ్రామ యువకుడు సురేష్ ను, స్టికర్ అండ్ మౌత్ పీస్ అందించిన తెలుగు ఉపాధ్యాయుడు మణయ్య ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు జయ కృష్ణ, ప్రవీణ్ కుమార్ ను గ్రామస్థులు,మండల విద్యాధికారి శంకర్, నోడల్ అధికారి సుధాకర్ అభినందించారు. పంచాయతీ కార్యదర్శి స్రవంతి, హుస్సేన్, సీఆర్పీలు మల్లేశం, నిరంజన్ , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వంటల ఘుమఘుమ

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వంటలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో స్వాంతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు వంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. 142 మంది విద్యార్థులు చిరుధాన్యాలు, కూరగాయలతో పలు వైరటీలు చేశారు. అలాగే ముగ్గులు, మెహిందీ పోటీలు కూడా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ హరికుమార్, అధ్యాపకులు వంటలను పరిశీలించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రాం రెడ్డి, అధ్యాపకులు నందు గౌడ్, దత్తు, నవీన్, లావణ్య, శ్వేత, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గాన్ని బుధవారం కొల్కూర్ రైతు వేదికలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి (నిజాంపూర్), ప్రధాన కార్యదర్శిగా మల్లన్న(పొట్టిపల్లి), ఉపాధ్యక్షులుగా భూపాల్రెడ్డి (కొల్కూర్), కార్యదర్శిగా రాములు(ఆత్మకూర్), కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్ రెడ్డి, అశోక్, శంకరయ్య, దశరథ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి హాజరై మాట్లాడారు. రైతు సమస్యలపై పోరాటం చేయాలని నూతన కమిటీకి సూచించారు. రైతులందరూ పార్టీలకు అతీతంగా సంఘటితం కావాలన్నారు. నిజాంపూర్ ఎస్ బీఐ బ్యాంకులో వెంటనే ఫీల్డ్ ఆఫీసర్‌ను నియమించాలన్నారు. అదేవిధంగా మంజీరా బ్యాక్ వాటర్‌తో పంటలు మునగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యను అభ్యసించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి స్థిరపడాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎల్లన్ కి డిగ్రీ కళాశాల, కొల్లాపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి క్రమశిక్షణతో జీవితంలో స్థిరపడాలని అన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండి, ర్యాగింగ్ వంటి వాటిని నిషేధించాలన్నారు. ఆడపిల్లలు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం పట్టివేత



స్వాధీనంచేసుకున్న కల్తీ మద్యం, చిత్రంలో నిందితులు

జహీరాబాద్ టౌన్: కర్నాటక రాష్ట్రం బీదర్ నుంచి జహీరాబాద్‌కు తరలిస్తున్న కల్తీ మద్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. బీదర్ పట్టణానికి చెందిన అంబదాస్, అభిషేక్ కల్తీ మద్యం దందా నిర్వహిస్తున్నారు. డిఫెన్స్‌కు చెందిన ఖాళీ సీసాలో కల్తీ మద్యం నింపి జహీరాబాద్ తదితర ప్రాంతాల్లో కావాల్సిన వారికి విక్రయిస్తుంటారు. బుధవారం కారులో కల్తీ మద్యం తీసుకెళ్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు మెదక్ డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు వీణారెడ్డి, చంద్రశేఖర్, గాంధీ నాయక్, అనిల్‌కుమార్, ఎస్ఐలు అలీమ్ కొత్తూర్(బి) వద్ద కాపు కాచి పట్టుకున్నారు. వీరి నుంచి 750 ఎంఎల్ గల 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 15మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపారు. సోమవారం, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 15మందిని పట్టుకున్నామని, వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున జరిమానా, అలాగే మరొకరికి రూ.2వేల జరిమానాతో పాటు మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

ఐదో అంతస్తు నుంచి పడి మేస్త్రీ మృతి

పటాన్‌చెరు టౌన్: ఐదో అంతస్తు నుంచి పడి ఓ మేస్త్రి మృతి చెందాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం...ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కమల్ భగవత్ యాదవ్(29), భార్య మహేశ్వరితో కలిసి మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ మండల పరిధిలోని దుర్గానగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాసరాజు, సుబ్బరాజు బిల్డర్ల వద్ద ఇద్దరు పనిలో చేరారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఐదు అంతస్తులు ప్లాస్టింగ్ పని చేస్తుండగా కమల్ భగవత్ ప్రమాదవశాత్తు జారిపడి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వట్‌పల్లి(అందోల్): ఆర్థిక ఇబ్బందులు, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని పోతులబోగూడలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎంకోటి శ్రీనివాస్ (40) అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి చెంది ఈనెల 13న మంగళవారం సాయంత్రం పత్తి చేనులో గడ్డి మందును సేవించి కుటుంబీలకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అతనిని వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం రుద్రార్ మాజీ సర్పంచు చిలకపల్లి శర్లప్ప(75) తన స్వగ్రామానికి వెళ్లడానికి బుధవారం రాజీవ్ చౌకవద్ద నడుచుకుంటూ వెళ్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన లారీ చక్రాలు ఆయన కాళ్లపై నుండి వెళ్లడం తో రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ సంఘటన చూసిన స్థానికులు వెంటనే శర్లప్పను నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలకు తరలించడంతో పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

◆ **రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతం**

నారాయణఖేడ్: శ్రీసరస్వతీ శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఈనెల 16న శుక్రవారం ఉదయం 9:30 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానాచార్యులు కుమ్మరి భూమేష్ తెలిపారు.

◆ **ఈత, తాటి మొక్కలు విరివిగా నాటాలి**

హత్నూర(సంగారెడ్డి): గ్రామాల్లో గౌడ కులస్తులు ఈత, తాటి మొక్కలను విరివిగా నాటాలని ఎక్సైజ్ సీఐ సాగర్ రెడ్డి అన్నారు. బుధవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, పలువురు ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు. సీఐ మాట్లాడుతూ ప్రతి గౌడ సోదరుడు 50 తగ్గకుండా మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ**

మునిపల్లి(అందోల్): మండల కేంద్రమైన మునిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న చంద్రమౌళి తన సొంత ఖర్చుతో మంగళవారం విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రక్తదాన శిబిరం**

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనయుడు, దివంగత విష్ణువర్ధన్ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం జీఎమ్మార్ యువసేన, జీవీఆర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్ కుమార్ యాదవ్, యాదగిరి యాదవ్, విజయ్ కుమార్, గూడెం విక్రంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎన్‌సీసీ దుస్తుల అందజేత**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఎన్‌సీసీ యూనిఫామ్ అందజేశారు. బుధవారం పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందించి రూ. ఐదువేల నగదు అందజేస్తున్నందుకు పాఠశాల తరఫున కార్పొరేటర్‌ను హెచ్‌ఎం స్పందన చౌదరి, ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం స్పందన చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **రేపు అమ్మవారి చీరల వేలం**

నారాయణఖేడ్: ఉమ్మడి మెదక్ జిల్లాలో సుప్రసిద్ధ మనూరు మండలం బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో ఈనెల 16వ తేదీన చీరల వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలను దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆరోజు ఉదయం 11.30గంటలకు వేలంలో విక్రయించనున్నట్లు చెప్పారు.